క్లుప్తంగా

పంచారామ క్షేత్రంలో 9 నుంచి సామూహిక వ్రతాలు


ఈఓ నీలకంఠం

సామర్లకోట: పంచారామ క్షేత్రం బాలాత్రిపుర సుందరి సమేత చాళుక్య కుమారా రామ భీమేశ్వరస్వామి ఆలయంలో శ్రావణ మాసం మూడు శుక్రవారాలు సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహిస్తున్నట్లు ఈఓ బళ్ల నీలకంఠం తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ పంచారామ క్షేత్రంలో ఏటా నిర్వహిస్తున్న సామూహిక వ్రతాలకు కొనసాగింపుగా 9వ తేదీ మొదటి శుక్రవారం, మూడో శుక్రవారం 23న, నాల్గవ శుక్రవారం 30 తేదిన ఆలయంలో సామూహిక వ్రతాలను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. పేర్లు నమోదు చేయించుకున్న భక్తులు ఉదయం 9 గంటలకు పూజల వద్ద ఉండాలని ఈఓ సూచించారు.

వేణుగోపాలునికి గరుడ వాహనం సమర్పణ


గరుడ వాహనాన్ని సమర్పిస్తున్న భక్తులు

పిఠాపురం: స్థానిక వేణుగోపాలస్వామి వారికి స్థానిక భక్తులు మంగళవారం సుమారు రూ.55వేల విలువైన ఇత్తడి గరుడ వాహనాన్ని సమర్పించారు. పిఠాపురానికి చెందిన లోకారెడ్డి బుచ్చిరామన్న దొర కుటుంబ సభ్యులు కేదారిశెట్టి వెంకట నాగ సూర్య గంగాధర్ రామారావు, చంద్రకన్య దంపతుల సహకారంతో ఏర్పాటు చేసిన ఈ గరుడవాహనాన్ని అర్చకులకు అందించారు. వాహన సంప్రోక్షణ అనంతరం గరుడ వాహన ప్రారంభిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈఓ నున్న శ్రీరాములు స్థానిక భక్తులు పాల్గొన్నారు.

గ్రంథాలయానికి మైక్‌సెట్ బహూకరణ


గ్రంథాలయాధికారికి మైక్‌సెట్ అందజేస్తున్న దాతలు

పెద్దాపురం: స్థానిక ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయానికి దాతలు మైక్‌సెట్ అందజేసినట్లు గ్రంథాలయాధికారి పాలంకి నాగరాజు తెలిపారు. విశ్రాంత హిందీ ఉపాధ్యాయుడు అల్లంరాజు శివరామకృష్ణ సుబ్రహ్మణ్యేశ్వర ప్రసాద్ మంగళవారం పాఠకుల కోసం రెండు ఫ్యాన్లు బహూకరించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ ప్రజలకు ఉపయోగపడే ప్రభుత్వ శాఖల కార్యాలయాలకు దాతల సహకారం ఎంతో అవసరమన్నారు. పాఠకుల సౌకర్యం కోసం మైక్ సెట్ సౌండ్ బాక్సులు అందజేసిన దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

తాగునీరు అందక అవస్థ

సామర్లకోట: స్థానిక సత్యనారాయణపురంలో వారం రోజులుగా తాగునీరు అందక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అయ్యప్ప చెరువు వద్ద ఉన్న మేజరు డ్రైనులో జేసీబీతో పూడిక తీసే సమయంలో తాగునీటి పైప్‌లైన్ ధ్వంసమైంది. దాంతో అప్పటి నుంచి సత్యనారాయణపురం ప్రజలకు మున్సిపాలిటీ తాగునీరు నిలిచిపోయింది. పైప్‌లైన్ పనులకు వర్షం అడ్డంకిగా మారిందని అధికారులు చెప్తున్నారు. బుధవారం మోటార్లతో నీరు తోడించి పైపులైన్ పనులు పూర్తి చే యిస్తామని కమిషనర్ జె.రామారావు తెలిపారు. అంత వరకు ట్యాంకరు ద్వారా నీరు సరఫరా చేస్తున్నట్లు చెప్పారు.

మరిడమ్మకు మఖ నక్షత్ర పూజలు


పూజలందుకున్న మరిడమ్మ తల్లి

పెద్దాపురం: స్థానిక మరిడమ్మ తల్లికి మంగళవారం మఖ నక్షత్ర ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్‌వీ రామ్మోహనరావు ఆధ్వర్యంలో అమ్మవారికి పంచామృత అభిషేకాలు, చండీహోమంతో పాటు బంగారు పుష్పాలతో పూజలు నిర్వహించగా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వీధిలైట్లు వెలిగించండి

పిఠాపురం: పట్టణంలో పలు ప్రాంతాల్లో వీధిలైట్లు వెలగక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానికులు వాపోతున్నారు. పిఠాపురం పాత పోలీసు స్టేషన్ సెంటర్ నుంచి నూకాలమ్మ గుడికి వెళ్లే రహదారిలో వారం రోజులుగా వీధి లైట్లు వెలగక పోయినా ఎవరు పట్టించుకోడం లేదని ఆయా ప్రాంతాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం వర్షాలు పడుతుండడంతో రాత్రి సమయాల్లో లైట్లు లేక చీకటిలో ఇబ్బందులకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే పలుమార్లు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోడం లేదని వారు ఆరోపిస్తున్నారు.

ముందు జాగ్రత్త తప్పనిసరి

- నస్యరక్షణ చర్యల్లో నిమగ్నమైన రైతులు
- నియోజకవర్గంలో 12 వేల హెక్టార్లలో వరి సాగు
- మండలంలో 10,154 ఎకరాలు
- సుమారు 6,150 మంది రైతులు


ఎరువులు చల్లుతున్న రైతు

కొత్తపల్లి: ఖరీఫ్ సేద్యం ఊడ్పులు దాదాపు ముగిశాయి. కురుస్తున్న భారీ వర్షంతో పలు గ్రామాల్లో వరి పొలాలు పూర్తిగా ముంపునకు గురయ్యాయి. ముంపు ప్రాంతాల్లోని పొలాల్లో నాట్లు వేయాల్సి ఉంది. ముంపునకు సంబంధించి రైతులు అధికారుల సూచనలు సలహాలు పాటించాలని వ్యవసాయ నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచిస్తున్నారు. దుక్కిపై చల్లే రసాయనిక ఎరువులతో పాటు పిచికారీ చేసే మందులను కూడా పలుమార్లు ఉపయోగిస్తే రైతు అనుకున్నంత దిగుబడి రావడానికి వీలుంటుంది. నియోజకవర్గంలో కొత్తపల్లి, పి.తాపురం, గొల్లప్రోలులో సుమారు 12 వేల హెక్టార్లలో వరి సాగవుతోంది. కొత్తపల్లి మండలంలో సుమరు 6,150 మంది రైతులు 10,154 ఎకరాల్లో ఖరీఫ్ సాగు చేస్తున్నారు.

సస్యరక్షణ చర్యల్లో జాగ్రత్తలు..

- రెండు లేక మూడు రకాల మందులను కలిపి పిచికారీ చేయాకూడదు.
- చేతులకు గ్లౌజులు, కళ్లకు అద్దాలు, ముక్కుకు మాస్క్ తప్పనిసరిగా వినియోగించాలి.
- పురుగు మందుల డబ్బాలను నోటితో తీయకూడదు, మందు ద్రావకాన్ని చేతులతో కలపకూడదు.
- పవర్ స్ప్రేయర్ నాజిల్‌ను పెద్దగా చేయకూడదు
- పిచికారీ సన్నగా తుంపరలా పడేలా చూసుకోవాలి. వ్యవసాయ అధికారులు సూచించిన మోతాదు ప్రకారమే కలుపుకోవాలి. ఉదయం వేళల్లో మాత్రమే పిచికారీ చేయాలి. గాలి వాలుకు ఎదురుగా ఉండి పిచికారీ చేయకూడదు. పైరు పెద్దగా ఉన్నపుడు స్ప్రేయర్ మాత్రమే ఉపయోగించాలి.
- పిచికారీ చేసేటపుడు తినడం, తాగడం, పొగ తాగడం, కళ్ల నులుముకోవడం, నోటిలో వేళ్లను పెట్టుకొవడం వంటివి చేయాకూడదు.
- గాయాలైన చేతులతో మందులను తాకకూడదు.
- మందుల డబ్బాలను చిన్నపిల్లలకు అందకుండా జాగ్రత్తగా ఉండాలి.
- ఖాళీ డబ్బాలను ఇంటి అవసరాలకు ఉపయోగించకుండా గొయ్యి తీసి పాతేయాలి.
- పిచికారీ పూర్తయిన వెంటనే స్నానం చేయాలి.
- పిచికారీ చేసేందుకు ధరించిన దుస్తులను ఇతర దుస్తులతో పాటు ఉతకకూడదు.

అవసరం మేరకే వినియోగించాలి



ఎరువులు, మందులను పంటలకు అవసరం మేరకు వినియోగించాలి. ఏ పంటైనా మొదటి 45 రోజుల్లో వచ్చే రోగాలకు తట్టుకునే సామర్థ్యం ఉంటుంది. రైతులు వ్యవసాయాధికారుల సలహాలను పాటిస్తే ఆశించిన దిగుబడి వస్తుంది. రైతులకు ఎప్పటికప్పుడు పంటల సాగుపై సలహాలు అందిస్తున్నాం. ఏ సమయంలో ఎంత మోతాదులో మందులను ఉపయోగించాలో తెలియజేస్తున్నాం.

– జోగిరాజు, మండల వ్యవసాయ అధికారి, కొత్తపల్లి

మేలైన సాగు పద్ధతులపై అవగాహన అవసరం

జిల్లా వ్యసాయాధికారి విజయకుమార్


మిత్ర పురుగులపై అవగాహన కల్పిస్తున్న జేడీ విజయకుమార్

సామర్లకోట: వ్యవసాయ సిబ్బందికి మేలైన వ్యవసాయ పద్ధతులపై పూర్తి స్థాయిలో అవగాహన ఉండాలని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.విజయ కుమార్ అన్నారు. మంగళవారం సాయంత్రం స్థానిక వ్యవసాయ క్షేత్రంలో జిల్లాలోని మండల స్థాయి వ్యవసాయాధికారులకు నిర్వహించిన శిక్షణలో ఆయన పాల్గొన్నారు. ఈ పంట నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ప్రతి గ్రామంలో వేసిన పంట పొలాల వివరాలతో ఈ–పంటలో నమోదు చేయాలని సూచించారు. ఈ మేరకు పంట నమోదు ప్రక్రియ, మేలైన వ్యవసాయ పద్ధతులపై గ్రామ స్థాయి, మండల స్థాయి వ్యవసాయ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. పంటలకు మేలు చేసే పురుగులు, కీడు చేసే పురుగులను ఎలా గుర్తించాలో వ్యవసాయ క్షేత్రంలోని పొలంలో ఫీల్డ్ విజిట్ నిర్వహించి శిక్షణ ఇచ్చారు. ప్రతి బుధవారం మండలానికి ఒక గ్రామంలో పొలంబడి నిర్వహించాలన్నారు. సేంద్రియ, ప్రకృతి వ్యవసాయం వల్ల ప్రయోజనాలను రైతులకు తెలియజేసి వాటిని ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ హరి, ఏడీఏలు రత్నప్రశాంతి, స్వాతి, బుల్లిబాబు, మాధవి,బాబురావు తదితరులు పాల్గొన్నారు.

పెద్దాపురం ఎస్సైగా మౌనిక బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరిస్తున్న మౌనిక

పెద్దాపురం: స్థానిక సబ్ ఇన్‌స్పెక్టర్‌గా వి.మౌనిక మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా సామర్లకోట ఎస్సైగా పని చేస్తున్న మౌనికను ఇక్కడికి ఎస్ఐగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. స్థానిక విలేకర్లతో ఆమె మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు తన వంతు కృషి చేస్తానన్నారు. పెద్దాపురం నియోజకవర్గంపై మంచి అవగాహన ఉందని అన్నారు. ప్రస్తుత ఎస్సై సురేష్‌కు కాకినాడకు వీఆర్‌కు పంపారు.

ట్రాఫిక్ ఎస్సైగా గరగారావు..


డీఎస్పీ లతాకుమారిని కలిసిన ఎస్సై అడపా గరగారావు

సామర్లకోట: స్థానిక ట్రాఫిక్ ఎస్సైగా అడపా గరగారావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ట్రాఫిక్ ఎస్సైగా పని చేసిన గరగారావును ఎన్నికల ముందు గుడివాడ ట్రాఫిక్ ఎస్సైగా బదిలీ చేశారు. ఎస్సైల సాధారణ బదిలీల్లో భాగంగా సామర్లకోటకు ఆయన తిరిగి వచ్చారు. ఈ మేరకు పెద్దాపురం డీఎస్పీ కె. లతాకుమారిని కలిసి ఆయన బాధ్యతలు స్వీకరించారు. పట్టణ పరిధిపై పూర్తి అవగాహన ఉండటంతో ట్రాఫిక్ సమస్య లేకుండా తన వంతు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

సీజనల్ వ్యాధులపై ఇంటింటా సర్వే

ఎ.విజయనగరంలో వైద్య సిబ్బంది పర్యటన


ఎ.విజయనగరంలో ఇంటింటి సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

పిఠాపురం: గొల్లప్రోలు మండలం ఎ.విజయనగరంలో కొన్ని రోజులుగా సీజనల్ వ్యాధులు పెరుగుతుండడంతో వైద్య సిబ్బంది అప్రమత్తమయ్యారు. మంగళవారం డీఎంహెచ్ఓ నరసింహ నాయక్, డిప్యూటీ డీఎంహెచ్ఓ సరిత, డీఎంఓ భాస్కర రావు, సిబ్బంది గ్రామంలో పర్యటించారు. తాగునీరు, డ్రైన్లు, పారిశుద్యాన్ని పరిశీలించి దేని వల్ల వ్యాధులు పెరుగుతున్నాయో చూసి వెంటనే నివారణ చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆయన ఎ.విజయనగరం వైద్యాధికారులు డాక్టర్ భారతి, రవి కుమార్ ఎంపీడీఓ జయప్రకాష్ వైద్య సిబ్బందితో కలిసి ఇంటింటికీ తిరిగి సర్వే నిర్వహించారు. డీఎంహెచ్ఓ మాట్లాడుతూ కాచి చల్లార్చిన నీటినే తాగాలని, వేడి పదార్థాలను మాత్రమే తినాలని ఆయన సూచించారు. గ్రామంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి డెంగీ మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధుల నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలని ఆయన వైద్య సిబ్బందిని ఆదేశించారు. గ్రామంలో పారిశుద్యం మెరుగుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్టు ఎంపీడీఓ తెలిపారు.

దుర్వ్యసనాలకు దూరంగా ఉండాలి

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అవగాహన సదస్సు


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న వక్తలు

పిఠాపురం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం దుర్వ్యసనాలు–నష్టాలు అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఉషశ్రీ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో పిల్లల వైద్య నిపుణుడు పీఎస్ రాజు, జనవిజ్ఞాన వేదిక నేత వి.సత్యనారాయణరెడ్డి తదితరులు విద్యార్థులకు సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ విద్యార్థులు వ్యసనాలకు బానిసలు కాకుండా కేవలం చదువుపైనే దృష్టి పెట్టాలన్నారు. జనవిజ్ఞాన వేదిక నేత వి.సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ సమాజంలో జరుగుతున్న మోసాలను వివరిస్తు వాటిని ఎలా ఎదుర్కొనాలో వివరించారు. జనరిక్ మందులు–వాటి ఉపయోగాలు, సంఘటితంగా ఉంటే కలిగే లాభాలను వివరించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఉషశ్రీ మాట్లాడుతు పొగాకు వల్ల వాటిని ఉపయోగించడం వల్ల కలిగే నష్టాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ కృష్ణప్రసాద్, శ్రీకర్ ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పూడికకు పరిష్కారం ఏదీ?


వాకతిప్పలో ముంపునకు గురైన వరినాట్లు


గోర్సలో గుర్రపుడెక్కతో మూసుకుపోయిన ఇరిగేషన్ కాలువ


వాకతిప్పలో గుర్రపు డెక్కతో మూసుకుపోయిన కాలువ

- చెరువులను తలపిస్తున్న పొలాలు
- నీట మునిగిన వరి నాట్లు
- రైతుల ఆందోళన

కొత్తపల్లి: ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యంతో మండలంలోని పలు గ్రామాల్లో వరి నాట్లు ముంపునకు గురయ్యాయి. కాలువల్లో పూడిక తొలగించకపోవడంతో ఎక్కడినీరు అక్కడే నిలిచిపోతోంది. వారం రోజులుగా ఎడతెరిపిలేకుండా కురుస్తున్న భారీ వర్షాలు, ఎగువ నుంచి వచ్చే వరద నీటితో వరి నాట్లు చెరువులను తలపిస్తున్నాయి. మండలంలోని కుతుకుడుమిల్లి, వాకతిప్ప, గోర్సతో పాటు కొండెవరం పంట పొలాలు మునిగిపోయాయి.

అధికారుల నిర్లక్ష్యమే కారణం



ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యం వల్లే మా వరినాట్లు మునిగిపోయాయి. కౌలు చేస్తున్న 10 ఎకరాల్లో ఇదే పరిస్థితి. వారం రోజుల నుంచి ఇదే పరిస్థితి. కాలువలు ఆధునీకరించకపోవడమూ ఒక కారణమే.

– రొంగల వీరబాబు, సర్పంచి, గోర్స

అధికారులు ఏమైనట్లు



పొలాలు ముంపునకు గురైనా ఏ అధికారీ పట్టించుకోవడం లేదు. వేలకు వేలు అప్పులు చేసి కౌలుకు తీసుకున్న పొలాలకు పెట్టుబడి పెడితే కళ్లముందే నీటి పాలవుతున్నాయి.

– కాళ్ల నాగన్న, రైతు

తహసీల్దార్ కార్యాలయంలో ఆర్డీఓ తనిఖీ


తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేస్తున్న ఆర్డీవో కిశోర్

కాకినాడ సిటీ: అర్బన్ తహసీల్దార్ కార్యాలయాన్ని మంగళవారం ఆర్డీవో ఇట్ల కిశోర్ ఆకస్మిక తనిఖీ చేశారు. రెవెన్యూ దస్త్రాలకు సంబంధించి సురక్షిత చర్యలు చేపట్టాలని, రికార్డు రూమును పరిశీలించి, అగ్నిమాపక నిరోధక యంత్రాలు ఏర్పాటు చేయాలన్నారు. రక్షణ చర్యలు చేపట్టాలని, ఆఫీసు పరిసరాలు పరిశీలించి, పరిసరాలు పరి శుభ్రంగా ఉండేలా చూడాలని ఆదేశించారు. సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. ఆర్డీవో కిశోర్ వెంట డిప్యూటీ తహసీల్దార్లు పవన్, ఆనంద్, దీపక్‌రాజు తదితరులు ఉన్నారు.

రాకపోకలు లేక జనం పస్తులు

- ఏఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో ధర్నా


ధర్నా నిర్వహిస్తున్న కాలనీ వాసులు

పిఠాపురం: గొల్లప్రోలు పట్టణ పరిధిలో కొత్తగా నిర్మించిన కాలనీవాసులకు రాకపోకలకు దారిలేక తాగునీరు, ఆహారం లేక పస్తులుంటున్నారని అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఏఐఎఫ్‌టీయూ) ఆధ్వర్యంలో మంగళవారం ర్యాలీ ధర్నా నిర్వహించారు. మొదటగా ఉధృతంగా ప్రవహిస్తున్న కొండ కాలువ వద్ద ధర్నా చేసి అక్కడ నుంచి ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు. అనంతరం జాతీయ రహదారిపై బైఠాయించి నినాదాలు చేశారు. ముంపు బాధితులకు తాగునీరు ఆహారం అందించి శాశ్వతంగా రాకపోకలు సాగించేలా కృషి చెయ్యాలని నినాదాలు చేశారు. యూనియన్ ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు కుంచె అంజి బాబు మాట్లాడుతూ ముంపు బాధితుల సమస్యలు పట్టని జిల్లా అధికారులు ఎందుకని, విధులు మరచి కాలక్షేపం చేస్తున్నారా అని ప్రశ్నించారు. ఉప ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో సమస్యలు పరిష్కరించకపోతే అంతకన్నా దౌర్భాగ్యం మరొకటి ఉండదన్నారు. వెంటనే ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఎంపీ ఉదయ్ శ్రీనివాస్, నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాస్ ఉన్నతాధికారులు స్పందించి కాలనీవాసుల సమస్యలు పరిష్కారానికి శ్రీకారం చుట్టాలని పేర్కొన్నారు. యూనియన్ నాయకులు గుడాల చార్లెస్, కేశవరపు వీరన్న, గొర్ల శివ, ఎస్ శంకర్, కొశిరెడ్డి గణేష్ పలువురు కాలనీవాసులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీకి ఎన్నికలు నిర్వహించాలి


ఎన్నికలు నిర్వహించాలని కోరుతున్న మాజీ సర్పంచ్ రత్నప్రసాద్ తదితరులు

కాకినాడ రూరల్: రమణయ్యపేటను కాకినాడ నగరపాలక సంస్థలో విలీనం చేయకుండా పంచాయతీగా కొనసాగించి ఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీని మాజీ సర్పంచ్ అడబాల రత్నప్రసాద్ తదితరులు కోరారు. గుడారిగుంటలోని నివాసం వద్ద మంగళవారం ఎమ్మెల్యేకు వినతి పత్రం అందించి, ఎన్నికలు జరగక ఆర్థిక సంఘ నిధులు నిలిచిపోయాని, అభివృద్ధికి దోహదపడేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

చెత్త తొలగింపు


ఎంపీపీ పాఠశాల వద్ద చెత్త తొలగిస్తున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్

కొత్తపల్లి: మండలంలోని కొండెవరం శివారు శొంఠివారి పాకల్లో ఉన్న ఎంపీపీ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల వద్ద అపరిశుభ్రత నెలకొంది. దీనిపై సాక్షి దినపత్రికలో సోమవారం శొంఠివారం పాకల్లో అపరిశుభ్రత అనే శీర్షికతో కథనం ప్రచురించిన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన అధికారులు పేరుకుపోయిన చెత్తను జేసీబీలతో తొలగించారు. పంచాయతీ కార్యదర్శి ముసలయ్య పర్యవేక్షణలో పారిశుధ్య పనులు చేపట్టారు.

ముంపు ప్రాంతాల్లో శాంతివర్ధన సేవలు


కూనవరం వరద బాధితులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న వీరబాబు తదితరులు

పెద్దాపురం: వరదల వల్ల ఇబ్బంది పడుతున్న ప్రాంతాల్లో స్థానిక పులిమేరు శాంతివర్ధన విభిన్న ప్రతిభావంతుల పాఠశాల తరఫున సేవలు అందించనున్నట్టు సంస్థ డైరెక్టర్ రాయవరపు వీరబాబు తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక విలేకర్లకు ఓ ప్రకటన విడుదల చేస్తూ రెండు రోజులుగా అల్లూరి సీతారామరాజు జిల్లా కూనవరం మండలం శబరి కొత్తగూడెం, కూనవరం, టేకులబోరు ప్రాంతంలోని సుమారు 250 మందికి శాంతివర్ధన, అమెజాన్, డొనేట్ కార్టు సంయుక్త ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు పంపిణీ చేసినట్టు తెలిపారు. వరద బాధితులకు సుమారు రూ. 1500 విలువైన విలువైన నిత్యావసర సరుకులతో పాటు దుప్పట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్.సత్య, సీజీఎం వ్యవస్థాపకులు నంగిన శామ్యూల్ సుదీప్, పాఠశాల ఏఓ వేణు, రాయవరపు చైతన్య, బాబి, రాజేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి


సామర్లకోట ప్రభుత్వ హైస్కూల్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈఓ శివరామకృష్ణయ్య

సామర్లకోట: చదువులో వెనుకబడిన పిల్లలపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎంఈఓ శివరామ కృష్ణయ్య అన్నారు. మంగవారం స్థానిక ప్రభుత్వ హైస్కూల్, సీబీఎం ఎలిమెంటరీ పాఠశాలలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ 10వ తరగతి విద్యార్థుల పట్ల ఇప్పటి నుంచీ ప్రత్యేక శ్రద్ధ చూపుతూ ప్రతి రోజు పూర్తి అయిన సిలబస్‌పై మరుసటి రోజు విద్యార్థులను అడిగి తెలుసుకోవాలన్నారు. ఈ విధంగా చేయడం వల్ల వారితో విద్య పట్ల శ్రద్ధ పెరుగుతుందని చెప్పారు. ఈ మేరకు విద్యార్థులకు సూచనలు ఇచ్చారు. అలాగే పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని ఆయన పరిశీలించారు. హైస్కూల్ హెచ్‌ఎం ప్రసన్న ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఫ్లైఓవర్‌పై ట్రాఫిక్ జామ్


సామర్లకోట వంతెనపై నిలిచిపోయిన వాహనాలు

సామర్లకోట: స్థానిక ఫ్లైఓవర్‌పై మంగళవారం సాయంత్రం ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. వంతెనపై అడుగడుగునా గోతులు పడడంతో వాటిని తప్పించే క్రమంలో చిన్న వాహనాలు ఎడమవైపు నుంచి కుడివైపునకు వస్తున్నాయి. దీంతో ఎదురుగుగా వస్తున్న వాహనాలతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీనికి తోడు కెనాల్ రోడ్డులో బ్రిడ్జి దిగువ భాగంలో మాండవ్యనారాయణస్వామి ఆలయం సమీపంలో రోడ్డు గోతులతో నిండిపోయింది. ఆ రోడ్డులో రాకపోకలు సాగించాల్సిన వాహనాలు బ్రిడ్జి మీదుగా రావడంతో ట్రాఫిక్ సమస్య మరింత జటిలమైంది. సాయంత్రం వివిధ కార్పొరేట్ కళాశాలల బస్సులు అదే సమయంలో రావడంతో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడం పోలీసులకు కష్టసాధ్యమైంది. దీనిపై ట్రాఫిక్ ఎస్సై అడపా గరగారావు మాట్లాడుతూ ఫ్లైఓవర్‌పై గోతులు పూడ్చించే చర్యలు చేపడతామని చెప్పారు.